www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 15 జులై 2024

5

వైఎస్ఆర్

దుర్గాబాయి జీవితాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కడప

స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి జీవితాన్ని విద్యార్థినులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్అసిఫ్ అన్నారు. జులై 15న దుర్గాబాయి జయంతి సందర్భంగా ఆర్కే సేవా సమితి దుర్గాభాయి చిత్రపటాలను డాక్టర్ అసిఫ్ చేతుల మీదగా ఆదివారం విడుదల చేశారు. దుర్గాబాయి దేశ్ముఖ్ స్వాతంత్ర్య సమరయోధురాలుగా, న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా ఆమె సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, వింధ్య, కమల ప్రియా, ఆయిషా పాల్గొన్నారు.

'ఉల్లి' రైతులకు కన్నీరే

- భారమవుతోన్న సాగు ఖర్చులు
- వంద కిలోల ఉల్లి విత్తనాల ధర రూ.90 వేలు
- గతంలో రూ.40 వేలు

ఉల్లి పంట సాగు చేసి నీరు పారగడుతున్న రైతు

ప్రజాశక్తి - చాపాడు

ఉల్లి ధరలు అమాంతం పెరిగి సామాన్య ప్రజలకు కన్నీరు తెప్పిస్తున్నాయి. అటు సాగు చేస్తున్న రైతులకు కూడా ఇబ్బందికరంగానే మారాయి. అడఫాదడపా వర్షాల కారణంగా సాగుచేసిన పంట దెబ్బతినడంతో ఒకటికి రెండుసార్లు సాగు ఖర్చులు రైతు మీద పడుతున్నాయి. గతంలో వంద కిలోల విత్తనాల ధర రూ. 40 నుంచి 45 వేల లోపు మాత్రమే. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా విత్తనాల ధర రూ.90 వేలకు చేరుకొని రైతులను కలవర పెడుతోంది. ఎకర సాగుకు ఖర్చు రూ. 40వేలు అవుతుండడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జూన్ , జులై నెలల్లో రూ. 30 వేలు వెచ్చించి విత్తనాలు సేకరించి రైతులు సాగు చేపట్టారు. అయితే వర్షం సరిగా పడకపోవడంతో సాగు దెబ్బతింది. రైతులు తిరిగి ఉల్లి పంట సాగు చేయాలని ముందుకెళితే విత్తనాల ధరతో కొనుగోలు చేయలేకపోతున్నారు. సరైన గిట్టుబాటు ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ధరలు క్వింటాలు రూ.10 వేల వరకు ఉంటాయన్న కారణంతో సాగు చేపడుతున్నారు. వర్షాలు లేక పంట దెబ్బతిని ఆర్థికంగా నష్టం ఏర్పడినప్పటికీ తిరిగి సాగుకు యత్నం చేపట్టారు. జిల్లాలో దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, తదితర ప్రాంతాల్లో 6వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులు కర్ణాటక ప్రాంతంలోని చిక్బలాపూర్ ,గోర్ బెద్దనూర్, నంద్యాల నుంచి విత్తనాలను సేకరించి సాగు చేపడుతున్నారు. ప్రస్తుతం కర్ణాటక రకం క్వింటాల్ రూ .6 వేల వరకు పలుకుతున్నాయి. క్వింటాల్ రూ.7 వేల నుంచి 10వేల గిట్టుబాటు ధరలు ఉంటే రైతులు సాగు ఖర్చులు వచ్చే అవకాశం ఉంటుంది.

రూ. 90 వేలతో విత్తనాల కొనుగోలు..

రెండు ఎకరాలలో మొదటిసారి క్వింటా రూ. 90వేల వెచ్చించి 30 కిలోల ఉల్లి విత్తనాలు నంద్యాల నుంచి తీసుకువచ్చి సాగు చేపట్టా. వర్షానికి దెబ్బతినడంతో రెండవసారి 60 కిలో కొనుగోలు చేసి సాగు 4ఎకరాలు చేపట్టాను. విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసి ఉంటే ఉపయోగకరంగా ఉండేది .

- ప్రసాద్ , సిద్దారెడ్డిపల్లె, చాపాడు మండలం.

రెండు దఫాలు సాగు చేశా..

ఈ ఏడాది సరైన వర్షాల లేని కారణంగా రెండు దఫాలు సాగు చేయాల్సి వచ్చింది. జూన్ చివరి లో రూ .90వేలు ఉన్న విత్తన ధరలు అమాంతం పెరిగి లక్షకుపైగా చేరుకున్నాయి. దిగుబడి వచ్చే సరికి ధరల పరిస్థితి ఎలా ఉంటుందోనని భయంగా ఉంది, రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి .

- శివరామ్, బయనపల్లె, దువ్వూరు మండలం.

దళితుడిపై దాష్టీకం

- పెత్తందారుడి అరుగుపై కూర్చున్నందుకు..
- కర్రతో చితకబాది, సల సల కాగే నూనె పోసి..
- జిజిహెచ్‌లో చావు బతుకుల మధ్య పోరాటం
- ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో ఘటన
- హత్యా నేరం కేసు నమోదు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ ఒంటిమిట్ట/కడప అర్బన్

జిల్లాలో ఓ దళితునిపై పెత్తందారు దాష్టీకం ఆలస్యంగా వెలుగు చూసింది. కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరుకు చెందిన కదిరి ప్రభాకర్ గంగపేరూరుకు చెందిన సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఉన్నఫళంగా కళ్లు తిరగడంతో పెన్నపేరూరుకు చెందిన చిన్నప్పగారి గజ్జెల వెంకటసుబ్బారెడ్డి ఇంటి అరుగుపై సొమ్మసిల్లిపోయాడు. దీనిపై ఆగ్రహించిన పెత్తం దారు 'మా ఇంటి అరుగుపై పడుకుంటావా' అంటూ కర్రతో చితక బాది, తన దుకాణంలోని సలసల కాగే నూనెను ఒంటిపై పోసిన అమానవీయ ఘటన చోటుచేసుకుంది. అనంతరం భర్తను ఇంటికి తీసుకొచ్చేందుకు వెళ్లిన భార్యను సైతం పెత్తందారు భార్య, తల్లి పరుష పద జాలంతో, కులం పేరుతో దూషించిన ఘటన మూ్డ్రోజుల కింద చోటు చేసుకుంది. కదిరి ప్రభాకర్ ఒళ్లంతా తీవ్రంగా కాలిన నేపథ్యంలో భార్య సహాయంతో ఇంటికి వెళ్లిపోయాడు. అర్థ రాత్రి నుంచి బొబ్బలు పెరగడం, గుండెలో దడదడ, ఒళ్లంతా మంటలు రావడం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడు తుండడంతో భార్య గమనించి జిల్లా సర్వజనాస్పత్రిలో చేర్చింది. ఈమేరకు వైద్య చికిత్స తీసుకుంటున్నారు. శరీరంలోని గుండెలు మొదలు కుని పొట్ట, పురుషాంగాలు తీవ్రంగా కాలిపోవడంతో చావు బతుకుల మధ్య పోరాడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం ఎక్కడికైనా తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తుండడం ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి దాపు రించింది. ఇటువంటి చిన్నపాటి ఘటనకు పెత్తందారు ఇంతటి తీవ్ర ంగా స్పందించడం వెనుక గల కారణామిటో అంతుబట్టడం లేదు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి అనుకూలంగా బాధితుని కుటుంబం ఓటేయలేదనే కోపంతో ఇలా చేశారేమోనని సందేహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

మమ్మల్ని బతకనీయండయ్యా!

కాయకష్టం చేసుకుని బతికే మమ్మల్ని బత కనీయండయ్యా. శుక్రవారం ఉదయం నుంచి భోజనం చేయకపోవడంతో సాయంత్రం ఏడు గంటల సమయంలో సొమ్మసిల్లిన నేరానికి ఇంతటి శిక్ష వేయడం అమానుషం. గంగపేరూరులో తమ సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా కళ్లు తిరగడం వల్ల పెత్తందారుని అరుగు మీద పడుకున్న నేరానికి మానవత్వం లేకుండా ఇంత కఠినంగా శిక్షించడమేమిటి. ప్రస్తుతం ఆయన పరిస్థితి సీరియస్‌గా ఉందని, మెరుగైన వైద్యం కోసం ఎక్కడైనా తీసుకె ళ్లాలనే వైద్యుల సిఫారసుల నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది.

-కదిరి జయమ్మ, బాధితుని భార్య, పెన్నపేరూరు.

మా నాన్నను బతికించండి!

ఒళ్లంతా తీవ్రంగా కాలిన గాయాలతో బాధపడుతున్న మా నాన్నను కాపాడండి. అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా కళ్లుతిరిగి సొమ్మసిల్లిన నేపథ్యంలో పెత్తందారుని ఇంటి అరుగుపై పడుకుంటే ఇంత తీవ్రంగా స్పందించడాన్ని గమనిస్తే కక్ష సాధింపును తలపి స్తోంది. నిద్ర లేపడం మొదలుకుని కాయకష్టం చేసుకుని బతికే తమ నాన్నపై విచక్షణా రహితంగా చలచల కాగే నూనేతో దాడి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది.

-కదిరి సునీల్, బాధితుని కుమారుడు,పెన్నపేరూరు.

చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

హత్యానేరం కింద కేసు నమోదు చేయాలి : సిపిఎం

ఘటనపై మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ఆర్ జిల్లా సిపిఎం కార్యదర్శి చంద్రశేఖర్

దళితునిపై అ రాచకపు, హేయమైన దాడికి పాల్పడిన ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు పెత్తందారు గజ్జెల వెంకట సుబ్బారెడ్డిపై హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు కదిరి ప్రభాకర్‌ను పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బాధిత కుటుంబం వైసిపికి ఓటేయలేదనే కోపాన్ని మనసులో పెట్టుకుని దాడికి పాల్పడినట్లు ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి జోక్యం చేసుకుని, బాధితునికి మెరుగైన వైద్య సేవలు అందిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదే సమయంలో ఇటువంటి హేయమైన దాడులకు పాల్పడే వారికి మరుపురాని గుర్తు ఉండేలా నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లాలోని దళిత సెక్షన్లలను సమీకరించి కలెక్టరేట్ ఎదుట ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు. ఇటువంటి అమానవీయ సంఘటన చోటుచేసుకుని సుమారు మూడ్రోజులు అవుతున్నప్పటికీ పోలీసులు నిందితుని అదుపులోకి తీసుకో కపోవడమేమిటని ఆక్షేపించారు. సమావేశంలో ఆయన వెంట సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, మండల నాయకులు కోనేటి నరసయ్య సహా పలువురు నాయకులు, బాధితుని బంధువులు ఉన్నారు.

గజ్జల వెంకట సుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

దళితుడిపై కాగిన నూనె పోసిన గజ్జల వెంకట సుబ్బారెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి హత్యాయత్నం కేసు నమోదు చేయాలని అన్నమయ్య జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కన్వీనర్ పెంచలయ్య, అధ్యక్షులు డిసి వెంకటయ్య ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం పెన్నా పేరూరు గ్రామంలో కుల అహంకారంతో దళితుడైన కదిరి ప్రభాకర్ అనే వ్యక్తి పైన వేడి వేడి నూనె పోయడం బాధాకరమన్నారు. సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కళ్ళు తిరుగుతున్నాయని అరుగు మీద కూర్చున్నందుకు అహంకారం తలకెక్కిన గజ్జల వెంకటసుబ్బారెడ్డి కర్రతో కొట్టి తన ఇంట్లో పెనం మీద కాగుతున్న నూనె పోయడం అమానుష చర్య అన్నారు. గాయాల పాలైన కదిరి ప్రభాకర్ కు ప్రభుత్వం మెరుగైన వైద్యం చేయించాలని ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఘటనను ఖండించాలని కోరారు.

జిల్లాలో వైద్య శిబిరాలు నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుతం డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య శాఖ అధికారులు జిల్లాలో రెగ్యులర్ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం పరిస్థితులు మార్పు, దోమల వల్ల డయేరియా విజృంభిస్తోందన్నారు. డయేరియా వల్ల ప్రజలు నిత్యం ఆసుపత్రుల పాలు అవుతువున్నారని పేర్కొన్నారు. ఇదే అదునుగా చూసుకుని ప్రయివేటు ఆసుపత్రి యాజమాన్యాలు ప్రజల వద్ద విపరీతంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. గ్రామీన ప్రాంత ప్రజలు, ఆర్ఎంపిలు ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారని చెప్పారు. డయేరియాతో మరణాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. గత కొద్ది రోజుల కిందట ఖాజీపేటలో ఒకరు చనిపోయారని పేర్కొన్నారు. అలాగే నీటి కలుషితం, ఫుడ్ పాయిజన్ వల్ల స్కూల్స్, హాస్టళ్లలోనూ విద్యార్థులు ఈమధ్యనే అనారోగ్యాల భారిన పడిన సంఘటనలు చూస్తున్నామన్నారు. ఇటువంటి తరుణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, స్కూల్స్, హాస్టల్స్ లలో రెగ్యులర్ మెడికల్ క్యాంపులు వంటివి నిర్వహించాలని కోరారు. దోమల నివారణకు రెగ్యులర్‌గా ఫాగింగ్ నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు విజయ్, సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

జిపిఎస్ గెజిట్ అమలును రద్దు చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎస్ ఉద్యోగులకు జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాజ పత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ 1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తల రాజు, రాళ్లపల్లి అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉద్యోగులను విస్మరించి జిపిఎస్ విధానాన్ని అమలు పరచడానికి పూనుకోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ఎన్నికల ముందు జిపిఎస్‌కు సంబంధించిన రాజ పత్రాన్ని విడుదల చేయకుండా తాత్కాలికంగా ఆపేశారని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను చేయడానికి సిద్ధపడడం సమంజసం కాదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే జిపిఎస్ అమలకు సంబంధించిన రాజపత్రాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరాంజుల రెడ్డి మాట్లాడుతూ జిపిఎస్ అమలు విధానానికి సంబంధించిన రాజ పత్రాన్ని వెంటనే రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో, సిపిఎస్ ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ,విద్యాశాఖ మంత్రి చర్చించి ఉద్యోగులకు మేలు చేసే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సానం ఈశ్వర్ రెడ్డి, ఎం.నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు కాసిం వలి, జిల్లా కార్యదర్శి ఎస్. రమేష్ బాబు, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

బిట్స్ బుక్‌లెట్స్‌తో ఉత్తీర్ణత సులభతరం

ప్రజాశక్తి - కడప అర్బన్

డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఎపిటిఎఫ్ అమరావతి బిట్స్ బుక్లెట్‌తో ఉత్తీర్ణత సులభతరం అని జెఎసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు, ఎపిటిఎఫ్ అమ రావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున అన్నారు. ఆదివారం కడపలోని ఎన్‌జిఒలో ఎపిటిఎఫ్ అమరావతి తయారు చేసిన డిపార్ట్‌మెంటల్ పరీక్షల బిట్స్ బుక్లెట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా కీలకమన్నారు. ఉత్తీర్ణత సులభతరం అయ్యేవిధంగా ఎటిపిఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో బిట్స్ బులెట్లు తీసుకురావడం అభినందనీయమన్నారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఉత్తీర్ణతతో ఉద్యోగోన్నతలు, ఇంక్రిమెంట్లు పొందడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ప్రసాద్, ఈశ్వరచంద్ర, ఆలీ ఖాన్, చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డిపార్ట్మెంట్ పరీక్షలు సులభతరంగా ఉత్తీర్ణత అయ్యేవిధంగా పాఠ్యపుస్తకాలు, మోడల్ పేపర్లు పరి శీలించి తక్కువ బిట్లతో ఎక్కువ సక్సెస్ రేటు ఉండే విధంగా బిట్స్ బుక్లెట్లు తయారు చేశామని పేర్కొన్నారు. గత పరీక్షల్లో సైతం బిట్స్ బుక్స్ నుంచి 70 శాతం మేర బిట్లు వచ్చాయని చెప్పారు. పింఛను ఆర్థిక లాభాలపై లెక్కింపులు సులభతరమైన పద్ధతిలో మెటీరియల్‌లో పొందుపరిచామని తెలిపారు. మేకల శివార్జున మాట్లాడుతూ ఉపాధ్యాయుల మేధస్సుకు అనుగుణంగా మెటీరియల్ ఉందన్నారు.

బస్సు, లారీ ఢీ : కండక్టర్ మృతి

- 20 మంది ప్రయాణికులకు గాయాలు

ప్రజాశక్తి - నందలూరు

ప్రమాదంలో మృతి చెందిన బస్ కండక్టర్ తారక రాముడు

కడప - చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు ఆల్విన్ కర్మా గారం సమీపంలో బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో కండక్టర్ మృతి చెందారు. మరో 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు.. తిరుపతి నుంచి ఆర్‌టి జమ్మల మడుగుకు బస్సు బయలు దేరింది. బస్సు నందలూరు ఆల్విన్ కర్మాగారం వద్దకు రాగానే స్టీల్ రోల్ లోడ్‌తో తాడిపత్రి జిల్లా జింథాల్ నుంచి చెన్నైకి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్ తారక రాముడు (40) మీద స్టీల్ రోల్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులోని 20 మంది ప్రమాణికులకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ మల్లెల ధనుంజయలారీలో, బస్సు డ్రైవర్ రాజు బస్సులో ఇరుక్కు పోయారు. బస్సులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని కడప, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఇరుక్కుపోయిన వారిని పోలీసులు, స్థానికులు జెసిబిల సహాయంతో వెలికి తీశారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి స్థానిక ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. ఈ ప్రమాదంతో కడప చెన్నై రహదారిలో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, స్థానికులు, ఫైర్ ఇంజన్ సిబ్బంది ఎంతో కష్టపడి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తరలించారు. కాగా మృతిచెందిన కండక్టర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. వారిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్న కుమార్తె సిబిఐలో ఎస్ఐగా పనిచేస్తున్నారు. మరో కుమార్తె డిగ్రీ చదువు తున్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

దాడులను నిరసిస్తూ జూడాల ధర్నా

ప్రజాశక్తి - కడప

రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో ఉన్న వైద్యులపై దాడులు నిర్వహించడం హేయమైన చర్య అని, దాడులను నిరసిస్తూ ఆదివారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్ల (ఎపిజూడ) కడప అధ్యక్షుడు డాక్టర్ ఖదీర్ అహమ్మద్, ఉపాధ్యక్షులు డాక్టర్ అశ్విని, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ మణి దీపక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలు అందిస్తున్న వైద్యులపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. మూడు నెలలుగా ఉపకార వేతనాలు అందడం లేదన్నారు. వెంటనే అందేలా చూడాలన్నారు. కార్యక్ర మంలో ఏపీజూడ సభ్యులు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత చర్చి నూతన సహాయ డైరెక్టర్‌గా మహేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో పనిచేయడం సంతోషకరమని నూతన సహాయ డైరెక్టర్ రెవ ఫాదర్ పిల్లి మహేష్ అన్నారు. ఆదివారం ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర కార్యాలయంలో శాంతి సేవా సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ బృందం గౌరవప్రదంగా ఆయనను కలిసి శాలువాతో, పూలమాలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. అనంతరం పిల్లి మహేష్ మాట్లాడుతూ కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవరెండ్ డాక్టర్ బిషప్ గాలిబాలి ఆదేశాల మేరకు నెల్లూరు మేత్రాసనం నుంచి రాయలసీమకే తలమానికమైన కడప వేళాంగిణి ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం లో సేవలు చేయటానికి తనను నియమించారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన సహాయ డైరెక్టర్,రెవ ఫాదర్ విల్సన్ తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు బదిలీ అయ్యారని, ఆయన నిర్వహించే కార్యక్రమాలను తాను చేపడతానని వివరించారు. కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, మనోహర్, స్రవంతి, అమృత, సుధాకర్, వినీత్, పావని, రత్నకుమారి పాల్గొన్నారు.

తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలి

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున

ప్రజాశక్తి - కడప అర్బన్

1వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు పాఠశాలల్లో తెలుగు, ఆంగ్లమాధ్యమాలను కొనసాగించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివా అర్జున పేర్కొన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్‌కు అనుగుణంగా ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియాన్ని కూడా ప్రవేశపెట్టాలన్నారు. విద్యార్థులు మాతృభాషలో చదవడం వల్ల వారిలో ఉన్న నైపుణ్యాలు బయటపడతాయన్నారు. ప్రభుత్వం కేవలం ఇంగ్లీష్ మీడియం మాత్రమే ప్రవేశ పెట్టడం వల సగటు విద్యార్థులకు, సగటు కంటే తక్కువ ప్రజ్ఞ గల విద్యార్థులకు అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. అటువంటి విద్యార్థులు వారి మాతృభాష ను మాధ్యమంగా తీసుకుని చదివితే విద్యలో రాణించే అవకాశం సమృద్ధిగా ఉందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు మాధ్యమాన్ని కచ్చితంగా తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా ప్రవేశపెట్టాలని కోరారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 117 వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో జీవో నంబర్ 117ను తీసివేస్తామని లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆ జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరారు. 12వ పిఆర్‌సి ఇప్పటికే ఆలస్యమైనందువలన ఐఆర్‌ను తక్షణం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి. సుదర్శన్ బాబు, మేంద్రగుత్తి గంగరాజు, కట్టా గంగాధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేకల శివార్జున

యూనియన్‌లో చేరిన నాయకులతో తూగుట్ల మధు

ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నేషనల్ మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షులు తూగుట్ల మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఎపి పిటిడి నేషనల్ మజ్దూర్ అసోసియేషన్‌లోకి స్థానిక వైఎస్ఆర్ అసోసియేషన్ నాయకులు 22 మంది ఆదివారం చేరారు. వీరికి నేషనల్ మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షులు తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, స్టేట్ ప్రెసిడెంట్ శివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పివిఎస్ రావు ఘనస్వాగతం పలికారు. యూనియన్‌లో చేరిన వారిలో జివి రమణ, బివిఆర్ అంజనేయులు, వై బాబు, కుమార్, టిఎస్ నారాయణ, ఎంవి రమణ, సురేష్, బాబు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, వైఎస్ వాసు, ఎస్ఆర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలో ఉన్న మహేశ్వరీదేవి కల్యాణమండపంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూగుట్ల మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యలు ఏమైనా ఉంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం మీకు ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి ఒక్కటి నెరవేరుస్తుందన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, మహిళా కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం చేస్తున్న టిడిపి నేత ఇలియాస్

చిన్నారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీర్‌పల్లెలో వింత వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి టిడిపి నేతలు ఆదివారం ఆర్థికసాయం చేశారు. చింతలమడుగుపల్లె సమీపంలోని పక్కీర్‌పల్లెలో నివాసం ఉంటున్న హనీఫా అనే మూగ అమ్మాయికి ఒక పాప జన్మించింది. ఆ చిన్నారి వింత వ్యాధితో పుట్టడంతో వైద్యం చేయించాల్సి వచ్చింది. చికిత్స నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రులకే వెళ్లాల్సిన పరిస్థితి. చిన్నారి తల్లిదండ్రుల కుటుంబం పూట గడవటమే కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో చిన్నారికి వైద్యం చేయించలేరని స్థానికులు తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు టిడిపి మైనార్టీ నాయకుడు ఇలియాస్, హజ్రత్ సాయం చేశారు. టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ దృష్టికి తీసుకెళ్లారు. చిన్నారికి వైద్య సేవలు అందించేందుకు దాతలు సహకారం అవసరమని, మరికొంతం ఆర్థికసాయం చేసేందుకు దాతృత్వం చూపాలని షబ్బీర్ కోరారు. పక్కీర్‌పల్లెలో ఉన్న అంగన్వాడీకి ఫ్యాన్ వితరణ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మహబూబ్ షరీఫ్, భాస్కర్, మాబువలి, లాడెన్, బాబావలి పాల్గొన్నారు.

పీర్ల వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొలువుదీరిన పీర్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని ఆయా పీర్ల చావిడుల వద్ద మొహరం పండుగ సందర్భంగా నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ప్రజలు, భక్తులు కుల మతాలకతీతంగా ఆదివారం పీర్ల స్వాములకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హుజరత్ ఇమామ్ ఖాసిం, మౌలాలి స్వామి, బాదుల్లా స్వామి, చిన్న ఇమామ్ ఖాసిం, ఇమామ్ హుస్సేన్, షేక్షావలి షాషావలి స్వాములు పీర్ల స్వాములను కొలువుదీర్చినట్లు తెలిపారు. పండుగ 7వ రోజు ఆదివారం మధ్యాహ్నం పెద్ద పోస్ట్ ఆఫీస్ పీర్లచావిడి వద్ద నిర్వాహకులు దర్బార్ జిలానీబాషా అన్నదానం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు పీర్ల స్వాములను గుర్రంపై భక్తులు ఎత్తుకొని పట్టణంలోని పుర వీధులలో సవారి నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దర్బార్ జిలాని బాషా, కలాం బాషా, లాలు, బాబా బుడేన్ సాహెబ్, ఆజం, మస్తాన్, మునాఫ్, జబీర్ పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలపై సర్వే

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి అవసరాలపై సర్వే చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అన్ని గ్రామాలకు ఉపరితల జలాశయాలు, చేతి పంపులు, బోర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి ఇంటికి ఒక కుళాయిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు గ్రామాల్లో సర్వే చేపడుతున్నామన్నారు. ప్రజాప్రతినిధులు తాగునీటి సమస్య ఉంటే వివరాలను తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈనెల 17నాటికి సర్వే పూర్తి చేసి నివేదికలను ఎమ్మెల్యేకు అందజేస్తామన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. మాస్టర్ రాజా, శ్రీరాజా కళా నిలయం పులివెందుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులను ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినం దించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ రాజా, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇ-పంటపై అయోమయం

నమోదుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం - రాయితీలు, నష్టపరిహారంపై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పంటలైన పత్తి, వేరుశనగను రైతులు సాగు చేశారు. ఆయకట్టుతోపాటు మెట్ట ప్రాంత రైతులకూ ఈ ఏడాది సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. అదునుకు వర్షాలు పడ డంతో మెట్టలోనూ సాగు ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగవుతోందని అంచనా. ఏటా పంటల సాగు సమయంలో వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట నమోదు చేసేవారు. ఈసారి అలా జరగకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం ప్రతి ఏటా సాగు ప్రారంభ దశలో ఈ-క్రాప్ నమోదు చేయించింది. ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఈ క్రాప్ తప్పనిసరి చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ-క్రాప్ విధానంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బం ది ఆరా తీస్తున్నారు. వారి వద్ద కూడా సరైన సమాధానం లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పంట సాగుకు ఎరువులు కావాలన్నా, పంటను విక్రయించుకోవాలన్నా, పంట నష్టం పందేందుకు బీమా చేసి ఉండాలి. ఈ క్రాప్

ఇ క్రాప్ చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్‌ఫొటో)

ఇప్పటికీ ప్రారంభించకపోతే ఎలా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇంతటి ప్రాధాన్య మున్న పంటల నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం అలసత్వం చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి భరోసా అందేదని, కొత్త ప్రభుత్వం కొలువు దీరి నెల రోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం అందకపోవటంతో రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు బీమా వర్తింపజేంది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ-క్రాప్ నమోదు పక్రియ ప్రారంభించేంది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ పక్రియను నిర్వహించేవారు. వంట సాగు చేసిన రైతులు పొలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్ వివరాలు నమోదు చేసేవారు. ఈ-క్రాస్ ఆధారంగానే ఎరువులు, ఇతర సదుపాయాన్ని వ్యవసాయ సిబ్బంది అందించేవారు. రైతులు పండించిన పంటను ఈ క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది. వంట రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ వంటి పంటల నష్టపరిహారానికి ఈ క్రాప్ ఉపయోగపడింది. అలాగే పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం లభించింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో రైతులు ముందస్తు సాగుకు సన్నద్ధమయ్యారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి ఈ క్రాప్ నమోదుపై స్పష్టత ఇవ్వడంతోపాటు పెట్టుబడి సాయం అందించేందుకు చొరవ చూపించి రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పలువురు రైతులు కోరుతున్నారు.

కుల అహంకారులను వెంటనే అరెస్టు చేయాలి

మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కుల అహంకారులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి శిక్షించాలని కెవిపిఎస్ నాయకులు దాసరివిజయ్, ఎ.వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మస్టర్ పాయింట్ వద్ద వారు మాట్లా డుతూ ఎస్సీ మాల కులానికి చెందిన వ్యక్తి కదిరి ప్రభాకర్‌పై శుక్రవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో తన బంధువు చనిపోగా అంతక్రియలకు వెళ్లి వస్తున్న క్రమంలో కళ్లు తిరిగినట్లు ఉండడంతో పెన్నా పేరూరులోని చిన్నప్పగారి గజ్జల వెంకటసుబ్బారెడ్డి తండ్రి లక్ష్మీనారాయణ రెడ్డి ఇంటి ఎదురుగా అరుగుపైన పడుకున్నారన్నారు. కిరాణా షాపు గజ్జల వెంకటసుబ్బారెడ్డి ప్రభాకర్‌ను కర్రతో కొట్టి కంటిపై గాయపరిచడమే కాక, కులం పేరుతో దూషించారన్నారు. తమకు ఎదురుగా అరుగుపై పడు కుం టావా అని కాడాయిలో కాగుతున్న వేడి నూనె పోసి గాయపరచడం దుర్మార్గ మైన చర్య అన్నారు. దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే బాధిత కుటుంబానికి ఆ వ్యక్తి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. పూర్తిగా వైద్య ఖర్చులు భరించాలన్నారు. లేనిపక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో కమల్ బాషా, మున్నా, బికారి బాషా పాల్గొన్నారు.

మురుగు తొలగేదెన్నడో..?

ఆలయాల ముంగిట మురుగు నీరు.. భక్తులకు అసౌకర్యం

ప్రజాశక్తి-చక్రాయపేట

మండల కేంద్రమైన చక్రాయపేటలోని రాచరాయస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల ముందు భాగంలో మురికి నీరు నిలిచి ఆటంకంగా మారింది. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది పడడమేకాక దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపో తున్నారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని దేవస్థాన చైర్మన్ మోపురి రామాంజనేయరెడ్డి (అడ్వొకట్)తోపాటు స్థానిక ప్రజలు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. స్థానిక పంచాయతీరాజ్ అధికారులుకానీ, మండల అధికారులు కానీ, దేవాదాయ శాఖ అధికారులు కానీ పట్టించుకోవడంలేదని దేవస్థాన చైర్మన్ రామాం జనేయరెడ్డి ఆరోపించారు. వీధుల్లో వచ్చే నీటితోపాటు ఆ పరిసర ప్రాంతాల నుంచి ఉన్న మురుగు దొడ్ల నీళ్లు, బట్టలు ఉతికిన నీళ్లు, బోకులు కడిగే నీళ్లు దేవాలయ ముందు భాగానికి వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని శ్రీవెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయం ముందు భాగంలోకి ఆ మురికి నీరు రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయాల ముందు దర్శనమిస్తున్న మురుగునీటి కుంట

నోటీసులిస్తాం : ఇన్‌స్పెక్టర్ జనార్ధన

దేవాలయం ముందు భాగంలో వచ్చే మురికి నీటికి బాధ్యులైన వారికి నోటీసులు పంపుతాం. తగు చర్యలు తీసుకుంటామని కడప దేవాదాయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన తెలిపారు.

గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయండి



మంత్రితో జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజవర్గంలోని గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను జమ్మల మడుగు జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున కోరారు. ఆదివారం ఉదయం ఆయన నంద్యాలలో ఆర్కే ఫంక్షన్ హాల్‌లో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను, మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్‌ను కలిశారు. ఈ సందర్భంగా జమ్మలమగుగు నియోజకవర్గ స్థాయిలోని సమస్యలను, గండికోటపై ఒక నివేదిక అందజేశారు. అనంతరం నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్ర ప్రజలకు మంచి జరుగు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గండికోట పురాతన మెందన్నారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గండికోటను సందర్శించారు. ఇక్కడి ఆహ్లాదకరమైన ప్రదేశాన్ని చూసి ప్రపంచ పర్యాట కంగా గండికోటను అభివృద్ధి చేయాలని అందుకు తగ్గట్లు ఉత్సవాలు నిర్వహించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో వెనకడుగు వేశారని గుర్తు చేశారు. దానవుల పాడులోని జైనమత ప్రదేశం, మైలవరం మ్యూజియంను అభివృద్ధి చేయాల న్నారు. నియోజకవర్గంలోని మైనార్టీ, అన్నివర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. ఆ మేరకు పర్యాటక శాఖ మంత్రి స్పందించి గండికోటను కచ్చితంగా సందర్శించి, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గండికోట పర్యాటకంపై తనకు అందుబాటులో ఉండాలని మంత్రి చెప్పారని నాగార్జున పేర్కొన్నారు. అడిగిన వెంటనే స్పందిం చినందుకు జనసేన పార్టీ తరుపున మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో డిస్ట్రిక్ ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ పవన్‌కుమార్ ఉన్నారు.

జోరుగా సాగుతున్న హాకీ పోటీలు

నిన్న కేరళ, నేడు కర్ణాటకపై ఆంధ్ర బాలికల జట్టు విజయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వైఎస్ఆర్ క్రీడా ప్రాంగణంలో సౌత్‌జోన్ జూనియర్ బాలుర, బాలికల జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్-2024 హాకీ పోటీలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జట్లు తలపడగా.. ఆంధ్రప్రదేశ్ బాలికలు కర్ణాటకపై 3 స్కోర్‌తో ఘన విజయాన్ని సాధించారు. కర్ణాటక జట్టు 1తో సరిపెట్టుకొని వెనుదిరిగింది. దీంతో కర్ణాటక జట్టును ఆంధ్ర జట్టు దుమ్ము రేపింది. అనంతరం రెండో మ్యాచ్ బాలుర మ్యాచ్ కర్ణాటక, తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో విజయం సాధించిన బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శ్రీవిద్యను ఎంపిక చేశారు. మొత్తానికి ఆంధ్ర జట్టులో శ్రీవిద్య అనే క్రీడాకారిని శనివారం కేరళ జట్టుపై మెరుగైన ప్రతిభ కనబరిచి బెస్ట్ ప్లేయర్‌గా నిలిచింది. అలాగే ఆదివారం జరిగిన ఆంధ్ర, కర్ణాటక పోటీలో కూడా ఆంధ్ర జట్టు విజయకేతనం ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించడంతో ఆమెకు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది.

హాకీ ఆడుతున్న ఆంధ్ర, కర్ణాటక జట్లు

పొలాల్లో సంచరిస్తున్న అడవి ఆవులు

అడవి ఆవుల దాడితో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - కొండాపురం

అడవి ఆవుల దాడికి మండలంలోని వెంకటాపురం, కోనవారిపల్లె, ఉస్తికాయలపల్లె. కొట్టాలపల్లె, బురుజుపల్లె, కె.సుగుమంచిపల్లె, బ్రాహ్మణపల్లి గ్రామాల రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆయా గ్రామాల రైతులు దాదాపు 15వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. ఆ పొలాల్లోకి అడవి ఆవులు రాత్రివేళల్లో సంచరిస్తూ పంటను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అటవీ అధికారులు స్పం దించి అడవి ఆవుల బెడద నుంచి తమ పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్ పాషా

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మానవసేవలో పాల్గొని మాధవులుగా వెలుగొందాలని, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, విశ్రాంత ఎంఇఒ మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం కళాశాల ప్రిన్సిపల్ పాలా నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఇప్పటికే రాష్ట్రంలోని లక్షలాది మందికి సేవా కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. వివిధ రకాల స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ అదృష్టమన్నారు. డాక్టర్ రఫిక్ పాషా మాట్లాడుతూ విద్యార్థులకు సేవా దృక్పథంపై అవగాహన కల్పించడం, వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో మొక్కలు నాటడం, అనాథలకు, మతి స్థిమితం లేని వారికి ఆసరా కల్పించడం, అనాథ శరణాలయాల్లో చేర్పించడం, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు తగు ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. కడప రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శివశంకర్‌రెడ్డి, జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపర్నెంట్ డాక్టర్ రఫిక్ పాషా, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సీనియర్ సభ్యులు ధనిరెడ్డి ఓబులరెడ్డి, మాధవ గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పల్లా తిరుపతయ్య, మల్లెంకొండు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ఎం.శివగణపతి, ఈశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బేపారి మహమ్మద్ మజహార్ అలీ, పల్లా ఆనందబాబు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం : మానవత సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులుగా బిటి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా సంజీవ రాయుడు, ప్రధాన కార్యదర్శిగా పార్థ సారథి, కోశాధికారిగా వి.సుధాకర్ గుప్తా, జాయింట్ సెక్రెటరీ రామ్మోహన్‌రెడ్డి, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కార్యవర్గ విధివిధానాలపై చర్చించారు. సీనియర్ సభ్యులను ఘనంగా సన్మానించారు.

జాతీయ రహదారిపై కంప చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - పుల్లంపేట

కడప-చెన్నై జాతీయ రహదారిపై రెడ్డిపల్లెచెరువు కట్ట మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని గమనించిన రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి ఆదివారం వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను జెసిబి ద్వారా తొలగించడం జరిగింది. కంపచెట్ల తొలగింపు పట్ల వాహనదారులు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామాలకు వెళ్లే రహదారుల్లో కూడా కంపచెట్ల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయనిపల్లె రోడ్లలో కూడా కంప చెట్లను తొలగిస్తే బాగుంటుందని కొందరు ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తిరుపాల్, వెంకటసుబ్బయ్య, దేవరకొండ నరసింహులు, నారాయణ నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి - రామాపురం

ఉద్యోగస్తులకు ఉద్యోగం విరమణ సర్వ సాధారణమని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు మండలంలోని సుద్దమళ్ళ గ్రామం, బయ్యారెడ్డిగారిపల్లెకు చెందిన ప్రధానోపాధ్యాయుడు గడికోట బాలకృష్ణరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంకు ముఖ్యతిథిగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులకు ఉద్యోగ విర మణ అనేది ఉద్యోగంలో చేరిన రోజే తెలుస్తుందని ప్రతి ఉద్యోగికి జీవితంలోని ఉద్యోగ విరమణ, ఉద్యోగంలో చేరిన నాడు తమ జీవితంలో ఒక మైలురాళ్లుగా నిలిచిపోతాయన్నారు. ఉపాధ్యాయులు తమ జీవి తంలో కుటుంబ సభ్యులతో కంటే ఎక్కువ సమయం విద్యార్థులతో గడిపి వారి అభ్యున్నతికి దోహద పడతారని అన్నారు. సమాజంలో మంచి పౌరులుగా, నాయకులుగా కావాలన్నా ఉపాధ్యా యుల కృషి ఎంతో ఉంటుందని అన్నారు. బాలకృష్ణరెడ్డి తన సర్వీస్‌లో ఎక్కడ పని చేసినా పిల్లలతో వారి తల్లి దండ్రులతో మమేకమై ఉండేవారన్నారు. పదవీ విర మణ పొందినవారు తమ శేష జీవితాన్ని తోటపని, గోల్ఫింగ్, ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించడం లేదా వారి కుటుంబాలతో ఎక్కువ సమయం గడపడం వంటి అభిరుచులను స్వీకరించడం ద్వారా వారు ఎల్లప్పుడూ కోరుకునే జీవితాన్ని ఆస్వాదిం చాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, చలా మరెడ్డి, యోగంజిల్ రెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

హిందీ టెట్, డిఎస్‌సిపై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో హిందీ టెట్, డిఎస్‌సిపై ఉచిత అవగాహన సదస్సును ఈనెల 21న ఆదివారం స్థానిక భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు నిపుణులచే అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.టెట్, డిఎస్‌సి అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. పూర్తి వివరములకు 630370 1314 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - రామాపురం

శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని కసిరెడ్డి గారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురానికి దళితులు పేర్కొన్నారు. తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశాన స్థలంలేక వంకల్లో వాగుల్లో చెరువుల్లో కుంటల్లో వేయ వలసిన పరిస్థితి ఏర్పడిందని ఆ గ్రామానికి చెందిన మహి ళలు నాగరత్న, అమ రావతి, గంగోజమ్మ, నాగరతమ్మ, నాగమ్మ, రామలక్ష్మమ్మ, రవణమ్మ రామాను జులు, చిన్నప్ప, లక్ష్మమ్మ, భూషణమ్మలు తమ గ్రామానికి శ్మశాన స్థలాన్ని అధి కారులు చూపించాలని కోరారు. గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న అరకొర శ్మశాన స్థలంలో అంత్యక్రియలు జరుపుకుంటు న్నామని తెలిపారు. శ్మశానాన్ని పక్కన మూడు ఎకరాలు బంజరు భూమి ఉందని, ఆ భూమిని అదే గ్రామానికి చెందిన నాయకులు భూమి ఆక్రమించుకున్నారని అన్నారు. గ్రామానికి శ్మశాన స్థలం ఏర్పాటు చేయాలని గతంలో ఎన్ని మార్లు అధికారులకు విన్నవించిన మా గోడు పట్టించుకోలేదని వాపోయారు. గోపగుడిపల్లి సర్వేనెంబర్‌లో 775 ప్రభుత్వ భూమి మూడు ఎకరాల వరకు ఉందని, ఎకరా కేటాయించాలని కోరారు.